సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 18 । జూలై । 2024



పాడితో లాభాలపాలు.. - 8లో▸

వ్యవసాయానికి అనుబంధంగా పాడిపరిశ్రమ ఏర్పాటు చేసుకునేవారు జాగ్రత్తలు పాటిస్తే లాభాలు పొందవచ్చని సూచిస్తున్నారు సంబంధిత శాఖ అధికారులు.



పోలీసుల పేరుతో వసూళ్లు..

పోలీసులమంటూ రోడ్డుపై దోపిడీకి పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు పోలీసులు బుధవారం వెల్లడించారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 28⁰/25⁰

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరాలయంలో డీఎస్పీ పూజలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని మందరగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. బుధవారం అర్చకుడు నవీన్‌చారి వారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదం అందజేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



భూపాలపల్లి అర్బన్: ఈ నెల 26 నుంచి హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఫొటో–వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం, ఫొటో టెక్ ఆధ్వర్యంలో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను డీఎస్పీ సంపత్‌రావు భూపాలపల్లి మండల ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఫొటో ఎగ్జిబిషన్‌లు ఫొటో గ్రాఫర్లకు నూతన టెక్నాలజీని అందించడంలో తోడ్పడతాయని అన్నారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఫీ మాట్లాడుతూ.. హైదారాబాద్‌లో జరిగే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఫొటో–వీడియో గ్రాఫర్స్ పాల్గొనాలని కోరారు. టెక్నాలజీ పరంగా వస్తున్న మార్పులను తెలుసుకొని ఎక్స్‌పోను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గోపరాజు రాజు, మండల అధ్యక్షుడు మాదసి సతీష్, ప్రధాన కార్యదర్శి కార్కురి సతీష్, సభ్యులు పాషా, తోట శ్రీనివాస్, రడపాక రమేశ్, కొండు మల్లేష్, పూర్ణచందర్, బోయిన ప్రసాద్, సోనాసింగ్ పాల్గొన్నారు.

'పాలెం' ప్రాజెక్టుకు జలకళ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని మల్లాపురం గ్రామ శివారులోని గుట్టల మధ్య నిర్మించిన పాలెం ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు పడుతుండడంతో ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు జలకళతో నిండుకుండలా మారడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కరకట్ట పరిశీలన



ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ నుంచి ఏటూరునాగారం వరకు కోతకు గురైన కరకట్టను కాంగ్రెస్ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడుతూ జియో ట్యాగ్ లైన్ పనులు వేగవంతం చేయాలన్నారు. సమ్మక్క–సారలమ్మ బ్యారేజ్ 52గేట్లు ఎత్తివేశారని గోదావరి వరద పెరిగే అవకాశం ఉంటుందన్నారు. జాలర్లు గోదావరిలోకి వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ముక్కెర లాలయ్య, వావిలాల నర్సింహారావు, చెన్నూరి బాలరాజు, గద్దల నవీన్, గంపల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు పల్టీ



కన్నాయిగూడెం: మండల పరిధిలోని బుట్టాయిగూడెం సమీపంలో బొగతను చూసేందుకు వెళ్తున్న పర్యాటకుల కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామానికి చెందిన నలుగురు యువకులు వాజేడు మండలం చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతాన్ని చూడడానికి కారులో వెళ్తున్నారు. మార్గమధ్యలో ముప్పనపల్లి– బుట్టాయిగూడెంకు మధ్యలో ఉన్న మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి పల్టీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు.

మల్హర్ మండలం మల్లంపల్లిలో ట్రాక్టర్‌తో పొలాన్ని నాటుకు సిద్ధం చేస్తున్న రైతు



రైతన్న బిజీ

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- పొలం పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు
- పొంగిన వాగులు, కాల్వలు
- చెరువుల్లోకి చేరుతున్న వరదనీరు

భూపాలపల్లి రూరల్: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలకు జీవం పోసినట్లయింది. సీజన్ మొదలైన తర్వాత నైరుతి రుతుపవనాల కారణంగా సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం కురుస్తోంది. అటవీ గ్రామాల్లోని వాగులు, వంకల ద్వారా చెరువుల్లోకి వరద వచ్చి చేరుతోంది. ఈ వానాకాలం ప్రారంభం నాటి నుంచి సరైన వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో ప్రస్తుతం కురుస్తున్న వానలతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తూ.. పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.

అధికారులు అప్రమత్తం

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. వర్షాల వల్ల ఇబ్బందులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని గత రెండు రోజుల క్రితం కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులు, ఇతర యంత్రాంగానికి సూచనలు చేశారు.

పత్తి, మొక్కజొన్నకు ఊపిరి

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి మొక్కజొన్న పంటలకు ఊపిరిపోశాయి. 15రోజుల క్రితం కురిసిన మోస్తరు వర్షానికి జిల్లాలో ఎక్కువ శాతం రైతులు పత్తి విత్తనాలు నాటారు. తర్వాత వానలు మొహం చాటేయడంతో మొక్కలు వడలిపోయే దశకు చేరాయి. ఈ క్రమంలో కురుస్తున్న వర్షాలకు పత్తి మొక్కజొన్న జీవం పోసుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 86,560ఎకరాల్లో పత్తిసాగు చేశారు. బోర్లకింద వరినార్లు పోసిన వారితోపాటు చెరువు నీటితో సాగు చేసే రైతులు ఈ వానలతో నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు.

మూడు రోజుల వర్షపాతం వివరాలు (మిల్లీ.మీటర్లలో)

మండలం	జూలై 15	జూలై 16	జూలై 17
మహదేవపూర్	109.4	5.6	48.6
పలిమెల	34.2	2.8	12.4
మహాముత్తారం	24.8	4.2	28.6
కాటారం	101.6	60.6	53.2
మల్హర్‌రావు	42.8	4.4	23.2
చిట్యాల	37.2	13.0	6.6
టేకుమట్ల	85.8	32.4	5.6
మొగుళ్లపల్లి	28.6	17.6	5.4
రేగొండ	7.4	55.0	14.2
గణపురం	6.2	21.4	34.8
భూపాలపల్లి	6.6	02.2	22.2

రైతుల్లో హర్షం

వర్షాకాలంలో ఇప్పటి వరకు పంటలకు సరిపడా వర్షం కురవలేదు. అప్పుడప్పుడు కురిసినా ఒక ప్రాంతంలో కురిసి మరో ప్రాంతాల్లో కురువలేదు. దీంతో చెలకలు, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సగం మొలకెత్తగా రైతులు ఆందోళనకు గురయ్యారు. వెనువెంటనే వర్షాలు కురవకపోవడంతో వాడిపోయిన మొలకలపై ఆశలు వదులుకున్న రైతులు ప్రస్తుత వానలతో ఊపిరిపీల్చుకున్నారు. ఇదే సమయంలో బోర్ల వద్ద నార్లు వేసుకున్న రైతులు వరినాట్లు వేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈవర్షాలు ఇలాగే రెండు మూడు రోజులు కొనసాగితే బావులు, చెరువుల్లో పూర్తి స్థాయిలో నీరు చేరనుంది.

ఎరువులు సిద్ధంగా ఉన్నాయి..



జిల్లాలో సాగుకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. పత్తి విత్తనాలు విత్తుకునేందుకు అనుకూల సమయం కాదు. పత్తి కాకుండా అన్ని పంటలు సాగు చేసుకోవచ్చు. సలహాలు, సూచనలకు మీ పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలి. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుంది.

– విజయ్ భాస్కర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



చికెన్‌పల్లిలో నాటు వేయడానికి సిద్ధంగా ఉన్న నారు



నాటువేసిన పొలం

గోదావరి వద్ద భక్తజనం



గోదావరి స్నానాలు.. జలాభిషేకాలు

- తొలి ఏకాదశి సందర్భంగా గోదావరికి పోటెత్తిన భక్తులు
- కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు
- కిక్కిరిసిన ప్రధాన వీధులు.. ట్రాఫిక్ జామ్

కాళేశ్వరం: తొలి ఏకాదశి సందర్భంగా కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరికి భక్తులు పోటెత్తారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో స్నానాలు చేసి, గోదావరిలో దీపాలు వదిలారు. సైకత లింగాలు చేసి పూజించారు. శివసత్తుల పూనకాలతో గోదావరి తీరం హోరెత్తింది. భక్తజనం కొత్తనీరు చేరుతుండడంతో తొలి పండుగ సందర్భంగా ఇసుకతోపాటు నీటిని బాటిళ్లు, క్యాన్లలో ఇళ్లకు తీసుకెళ్లారు. ఆనీటిని పాడిపంటలపై చల్లుకుంటే మంచిజరుగుతుందని భక్తుల విశ్వాసం. అనంతరం కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు, జలాభిషేకాలు నిర్వహించారు. శుభానందదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయాలన్ని కిక్కిరిశాయి. గోదావరి తీరం, ఆలయ పరిసరాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి.

ట్రాఫిక్ జాం..

గోదావరిలో పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు ఉదయం నుంచి ఆర్టీసీతోపాటు వివిధ ప్రైవేట్ వాహనాల్లో తరలిరావడంతో బస్టాండ్ నుంచి గోదావరి తీరం వరకు ట్రాఫిక్ జామ్ అయింది. ప్రధాన దారులన్నీ భక్తులతో నిండి కనిపించాయి. హోటళ్లు, కిరాణ దుకాణాలు, టీ స్టాల్స్ వద్ద భక్తుల రద్దీ నెలకొంది. దీంతో ఎస్సై చక్రపాణి, ఏఎస్సై రాజేశం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటచేసుకోకుండా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొసాగింది.



గర్భగుడిలో అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

భక్తుల ఇక్కట్లు..

వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సంఖ్యకు సరిపడా ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. తక్కువ సంఖ్యలో ఆర్టీసీ బస్సులు రావడంతో భక్తులు కిక్కిరిసి ప్రయాణించాల్సి వచ్చింది. బస్సులు రాకపోవడంతో గంటల తరబడి మహిళలు, చిన్నారులతో బస్టాండ్ వద్ద నిరీక్షణ తప్పలేదు. దీంతో భక్తులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

మహాసభను విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: ఆగస్టు 9న హైదరాబాద్‌లోని జగ్జీవన్‌రామ్ భవన్ సరూర్‌నగర్‌లో జరిగే సేవాలాల్ సేనా రాష్ట్ర మహాసభకు జిల్లాలోని గిరిజనులు అధిక సంఖ్యలో తరలి రావాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబనాయక్ పిలుపునిచ్చారు. సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంబాబునాయక్ కరపత్రాలు ఆవిష్కరించి, మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గిరిజనులకు ఈ ప్రభుత్వంలో ప్రాధాన్యం లేకుండాపోయిందన్నారు. రాజకీయంగా, సామాజికంగా అనగ దొక్కబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సంతోష్ నాయక్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శారద, వాలునాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ(కొత్తపల్లిగోరి): మత సామరస్యానికి ప్రతీకగా ప్రజలందరూ సోదర భావంతో జరుపుకునే పండుగ మొహర్రం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో పీర్ల(మొహర్రం) పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు కులమతాలకు అతీతంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు నెరవేరిన భక్తులు మజీదు వద్ద మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చి కందూరు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జాతర భారీగా సాగింది. దీంతో పలు దుకాణాలు ఏర్పాటు చేశారు. సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో జాతర ప్రాంగణం కిక్కిరిసిపోయింది. జాతరలో పులి, కొండెంగ వేశాలు ఆకట్టుకున్నాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చిట్యాల సీఐ మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.



పీరీలను ఊరేగిస్తున్న ఆచారమంతులు

అధికారుల పనితీరు మెరుగుపర్చుకోవాలి

చిట్యాల: విద్యుత్ ట్రాన్స్‌కో సంస్థలో పనిచేస్తున్న అధికారులు పని మెరుగుపర్చుకుంటే నెలవారీగా ర్యాంకులు ఇస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ మల్సూర్ నాయక్, ఆపరేషన్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ చీఫ్ జనరల్ మేనేజర్ మధుసూదన్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను సందర్శించి అధికారుల పని తీరును చూసి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ పరిధిలో 16 సర్కిళ్లలో పని చేస్తున్న ఏఈలు, ఏడీఈలు, డీఈలు, ఎస్‌ఈలు తమ పని తీరును మెరుగుపర్చుకునేందుకు విద్యుత్ సంస్థ వివిధ కేటగిరీలో ర్యాంకులు ఇస్తున్నట్లు తెలిపారు. మే నెలకు సంబంధించి జిల్లాలో ఉత్తమ రూరల్ ఏఈగా ఎ.చంద్రశేఖర్ (చిట్యాల), ఉత్తమ రూరల్ ఎడిఈగా ఎస్. శ్రీనివాస్(చిట్యాల) ఎంపికై నట్లు తెలిపారు. ఈ మేరకు ఎంపికైన అధికారులకు సబ్‌డివిజన్ కార్యాలయంలో జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందించారు. మండలంలో వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ కొరత లేకుండా విద్యుత్‌ను ఇవ్వాలని అన్నారు. వర్షాకాలంలో సిబ్బంది జాగ్రత్తగా పని చేయాలని సూచించారు. అనంతరం ఎస్పీఎం షెడ్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డీఈ సదానందం, ఏడీఈలు సందీప్ పాటిల్, పవన్‌కుమార్, ఏఈలు శ్రీనివాస్, మణిదీప్, ప్రమోద్, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశంస పత్రం అందుకుంటున్న ఏఈ చంద్రశేఖర్

నాణ్యమైన విద్యుత్ అందజేయాలి

రేగొండ: వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందజేయాలని భూపాలపల్లి జిల్లా నోడల్ అధికారి మధుసూదన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ నెలలో అత్యధికంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయినట్టు గుర్తించామన్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా రిపేర్లు చేసి ట్రాన్స్‌ఫార్మర్లు సప్లయ్ చేయాలని అధికారులను ఆదేశించారు. సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్‌ని తనిఖీ చేశారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్సూర్ నాయక్, ఎంఆర్‌టీ కన్‌స్ట్రక్షన్ డివిజనల్ ఇంజనీర్ సదానందం, ఏఈ కనకయ్య పాల్గొన్నారు.

మూడు విడతలు.. రూ.2 లక్షలు

- నేటి నుంచి రైతు రుణమాఫీ షురూ
- అమల్లోకి కాంగ్రెస్ 'వరంగల్ డిక్లరేషన్'
- మొదటి విడత సుమారు 1.52 లక్షల మందికి రూ.లక్ష మాఫీ
- రైతు వేదికలు కేంద్రంగా ఉత్సవాలు
- హాజరుకానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షిప్రతినిధి, వరంగల్ :

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో మరో కీలకమైన రైతు రుణమాఫీ హామీ అమలుకు గురువారం నుంచి శ్రీకారం చుడుతున్నారు. 2022 మే 6న వరంగల్ డిక్లరేషన్ ద్వారా రాహుల్‌గాంధీ రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయబోతున్నది. మొదటి విడత రూ.1లక్ష మాఫీ చేసేందుకు అర్హులైన రైతుల జాబితా బుధవారమే విడుదల చేశారు. ఉమ్మడి వరంగల్‌లో ఎంతమందికి మాఫీ అవుతుందన్న విషయాన్ని అధికారులు కచ్చితంగా చెప్పడం లేదు. అయితే వ్యవసాయశాఖ అధికారులతోపాటు లీడ్ బ్యాంకు మేనేజర్లు జిల్లాల వారీగా రుణమాఫీ పథకం పరిధిలోకి ఎంతమంది వస్తారనే విషయమై వివరాలు సేకరించారు. భూమి ఉన్న ప్రతీ రైతు బ్యాంకులో తీసుకున్న అప్పు, వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు ఉంటే మాఫీ చేసేలా.. అంతకుమించి ఉన్న మొత్తాన్ని రైతు చెల్లించుకుంటే మిగతాది మాఫీ పరిధిలోకి వచ్చేలా జాబితాలు తయారు చేశారు. కాగా, ఈ రుణమాఫీ పథకం మూడు విడతల్లో అమలు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రకటించగా.. గురువారం నుంచి మొదటి విడత రూ.1లక్ష మాఫీ చేయనున్నారు. దీంతో హనుమకొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాలకు చెందిన సుమారు 1.52 లక్షల మంది రైతులు మొదటి జాబితాలో ఉంటారని అధికారులు చెబుతున్నారు.



సుమారు రూ.5,812 కోట్లకు పైనే అవసరం..

ఆరు జిల్లాల పరిధిలో దాదాపు 3.80 లక్షల మందికి పైగా రైతులు మూడు విడతల రుణమాఫీకి అర్హులుగా తేలే అవకాశముందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ మధ్యకాలంలో తీసుకున్న రుణానికి మాత్రమే ఈ పథకం వర్తింపజేస్తున్నారు. ఆ మేరకు వ్యవసాయశాఖ లెక్కలు తీసింది. ఉమ్మడి జిల్లాలో 8,89,789 మంది రైతులు రైతుభరోసా ద్వారా పెట్టుబడి సాయం పొందుతున్నారు. అలాగే, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పీఎంకేఎస్) పథకం కింద 3,82,016 మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. అయితే, ఈ లెక్కన ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం సుమారు 3.82 లక్షల మంది రైతులకు రూ.5,812 కోట్ల వరకు రుణమాఫీ అయ్యే అవకాశం ఉందని ప్రాథమిక అంచనా. ఇందుకు సుమారు రూ.5,812 కోట్లకు పైగా నిధులు అవసరముంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎక్కువగా చిన్న కమతాల్లో పంటలు వేసిన వారే గతంలో పంటల సాగుకు స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. పైగా గత సర్కారు గతేడాది రూ.లక్ష లోపు వారికి రుణమాఫీ చేసింది. దీంతో అంతకన్నా ఎక్కువ ఉన్న వారి బకాయిలు అలాగే ఉండిపోయాయి. ఆ మొత్తం ప్రతి నెలా వడ్డీతో కలిపి పెరిగిపోయింది. వీటన్నింటిపై వ్యవసాయశాఖ అధికారులకు వచ్చిన నమూనా ప్రకారం గ్రామాల వారీగా అర్హుల వివరాలను ఇంకా సేకరిస్తున్నారు. ఈ విషయమై సలహాలు, సంప్రదింపుల కోసం ప్రతీ బ్యాంకు పరిధిలో ఓ నోడల్ అధికారిని నియమించారు.

రైతు రుణమాఫీ వేడుకలు..

పండుగ వాతావరణంలో రైతు రుణమాఫీ వేడుకలు నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు బుధవారం ప్రజాభవన్‌లో ఉమ్మడి వరంగల్‌కు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'నా జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు. గురువారం సాయంత్రం 4 గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేస్తున్నాం. రూ.7వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళ్తాయి. నెలాఖరులోగా రూ.లక్షన్నర వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తాం. ఆగస్టులోగా రూ.2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేసి ఆ ప్రక్రియను పూర్తి చేస్తాం. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే రుణమాఫీ. మనం చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించండి' అని సీఎం ఉమ్మడి జిల్లా నేతలకు సూచించినట్లు చెప్పారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పామని, ఆర్థిక నిపుణులు కూడా రుణమాఫీ కష్టమని చెప్పినా హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



బీరన్న బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

బీరన్నకు బోనాలు

భూపాలపల్లి అర్బన్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలో గొల్ల కురుమలు బీరన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీరన్న ఆలయం వరకు డోలు వాయిద్యాలతో బోనాలతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. తొలి ఏకాదశి సందర్భంగా పట్టణంలో ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



ఒగ్గు కళాకారుల విన్యాసం

కొంగల కోలాహలం..



కొత్తపల్లి సమీప వాగులో కనువిందు చేస్తున్న నైజీరియన్ కొంగలు

కొత్తగూడ: మండలంలోని కొత్తపల్లిలో విదేశీ పక్షులు కనువిందు చేస్తున్నాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగుల్లో నీరు చేరుతోంది. దీంతో నైజీరియన్ కొంగలు నీటిపై వాలి కనువిందు చేస్తున్నాయి. భారీ పొడవు, తెలుపు, నలుపు మచ్చలు, పచ్చటి పొడవైన ముక్కు కలిగి అందంగా కనిపిస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

భారీ కొండచిలువ లభ్యం



కొండ చిలువను అప్పగిస్తున్న గ్రామస్తులు

కొత్తగూడ: మండలంలోని వేలుబెల్లి పెద్ద చెరువులో బుధవారం భారీ కొండ చిలువ లభించింది. కట్టపై బుసలు కొడుతూ కొంత సేపు హల్‌చల్ చేసిన కొండ చిలువ.. చివరకు చెరువులోని చేపల వలలకు చిక్కింది. దీనిని గ్రామస్తులు పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ఈ కొండచిలువ సుమారు 10 ఫీట్ల పొడవు ఉందని, ఇది అరుదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులను అభినందించారు.

పాడితో లాభాల పాలు..

డెయిరీ ఏర్పాటులో జాగ్రత్తలు పాటిస్తే అధిక ప్రయోజనాలు


- పాడిపరిశ్రమలో మెళకువలు అవసరం
- ఔత్సాహికులకు పశువైద్యాధికారి సలహాలు, సూచనలు

కాజీపేట: వ్యవసాయానికి అనుబంధంగా రైతులు, యువకులు డెయిరీఫామ్(పాడిపరిశ్రమ) ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. అయితే కొంత మంది అవగాహనారాహిత్యం, అనుభవలేమితో డెయిరీలో అనుకున్న లాభాలు రాక ఆర్థికంగా నష్టపోతున్నారు. డెయిరీ ఫామ్ ఏర్పాటు చేసే ముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై ప్రతి వ్యక్తి సంపూర్ణ అవగాహన కల్పించుకోవాలి. ఆ అంశాలపై మడికొండ పశువైద్యాధికారి కరుణాకర్‌రెడ్డి సలహాలు, సూచనలు చేస్తున్నారు. వాటిని పాటిస్తే పాడి లాభసాటిగా మారుతుంది. మార్కెటింగ్ సౌకర్యం, హోటళ్లు, హాస్టళ్లు, స్వీట్ షాపులు, పాల సేకరణ కేంద్రాలు, వినియోగదారులు తదితర వివరాలను ముందే తెలుకోవాలి. దీని ఆధారంగానే పాడి పశువుల పోషణ ప్రారంభించాలి.

పశువుల కొట్టాలు..

పశువుల కొట్టాలను మంచి వాతావరణం, ఎత్తైన ప్రదేశం, రహదారి పక్కన ఏర్పాటు చేసుకోవాలి. అధిక ఖర్చుతో సిమెంట్ రేకులు వేసి పశుశాలలు నిర్మించే బదులు తక్కువ ఖర్చుతో తాటి ఆకులతో కొట్టాలను నిర్మించుకోవచ్చు. ఎండాకాలంలో వడగాలులు, చలి కాలంలో ఈదురుగాలుల బారిన పడకుండా పాకల చుట్టూ సుబాబుల్, అవిసే వంటి చెట్లు పెంచితే నీడతో పాటు కలప, పశుగ్రాసం లభిస్తుంది.





కాజీపేట శివారులోని డెయిరీ ఫామ్

నీటి సౌకర్యం చూసుకోవాలి..

- పశువులు తాగడానికి, వాటిని శుభ్రపర్చడానికి, పశుగ్రాసం సాగుకు పుష్కలంగా నీటి సౌకర్యం ఉన్న స్థలం ఎంచుకోవాలి.

పని మనుషుల నియామకమే ముఖ్యం..

- నమ్మకమైన పని మనుషులను ఎంచుకోవడమే గాకుండా పాలు పితకడంలో అనుభవం కలిగిన వారిని పనిలో పెట్టుకోవాలి.

డెయిరీల సందర్శన చేయాలి..

- పాడిపోషణ ప్రారంభించే ముందు లాభాల్లో ఉన్న డెయిరీలను స్వయంగా సందర్శించి వారి పద్ధతులపై అవగాహన కల్పించుకోవాలి. అదే డెయిరీల ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తుందని గుర్తించాలి.

ఆర్థిక వనరుల ఏర్పాటే ముఖ్యం..

- పశువుల సంఖ్య ఆధారంగా షెడ్లు, ఇతర సౌకర్యాల ఏర్పాటుకు పశువుల కొనుగోలుకు కావాల్సిన డబ్బులు స్వయంగా కానీ, బ్యాంకు రుణం ద్వారా కానీ సమకూర్చుకోవాలి. ఏవైనా సబ్సిడీలు లభించే అవకాశాలుంటే వాటిని వినియోగించుకోవాలి.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి..

- పాడి పశువుల పోషణలో పర్యవేక్షణ ముఖ్యం. ఎట్టి పరిస్థితుల్లోనూ పని చేసే వారిపై ఆధారపడొద్దు. పశువులు కొనుగోలు చేసిన తేదీ, పాల దిగుబడి వివరాలు, చూడి కట్టిన వివరాలు, టీకాలు వేసిన వివరాలను ఎప్పటికప్పుడు తప్పని సరిగా రికార్డులో నమోదు చేయాల్సి ఉంటుంది.

పశువులకు బీమా తప్పని సరి..

- పశువులకు రవాణా సమయంలో ప్రమాదం జరిగినా, తుపాన్లు, వరదలు, పిడుగులు, అగ్ని ప్రమాదాలు, శస్త్ర చికిత్స వంటి పరిస్థితుల్లో మరణాలు సంభవించినా పశు ఖరీదు తిరిగి పొందడానికి తప్పని సరిగా బీమా చేయించుకోవాలి. కొంతమంది ఖర్చుకు భయపడి మిన్నకుండిపోతుంటారు. ఇది సరికాదు.

దాణా.. పరికరాల కొనుగోలు..

- పాడి గేదెలు, ఆవులకు అందించడానికి సమీకృత దాణా స్వయంగా తయారు చేసుకోవాలి. దాణా ముడి పదార్థాలను కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవాలి. వరిగడ్డిని ముందే కొనుగోలు చేసి నిల్వ పెట్టుకోవాలి. పశుగ్రాసం ముక్కలుగా కత్తిరించి మేపడానికి చాప్‌కట్టర్ ఏర్పాటు చేసుకోవాలి. దాణా తయారీకి ఫీడ్ మిక్సింగ్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలి.

పశువైద్య సౌకర్యం కీలకమే..

- పశు వైద్య సౌకర్యం, కృత్రిమ గర్భోత్పత్తి సౌకర్యం అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించాలి.
- పశువుల కొనుగోలు సమయంలో వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి.
- రోజుకు 10–12 లీటర్ల పాలు ఇచ్చే సంకర జాతి ఆవులను, 8–10 లీటర్ల పాలు ఇచ్చే గ్రేడెడ్ ముర్రజాతి గేదెలను పోషిస్తే లాభదాయకంగా ఉంటుంది. గేదెలను అక్టోబర్ నుంచి జనవరి మధ్య కాలంలో కొనుగోలు చేయడం మంచిది. ఆ సమయంలో తక్కువ ఖరీదుకు లభ్యమవుతాయి.

పశుగ్రాసాల సాగు..

పట్టణాల్లో పశుగ్రాసాల సాగు, ఎండు మేత ఖర్చుతో కూడుకున్న పని. స్థలం ఎక్కువ లభ్యం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో పశుపోషణ ఖర్చు పెరిగి, పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉండదు. పచ్చిమేత ఉత్పత్తికి సరిపోనూ స్థలం ఉండే ప్రాంతాల్లోనే డెయిరీ ఏర్పాటు చేసుకోవాలి. పాడిపశువులు కొనుగోలుకు రెండు, మూడు నెలల ముందే పశుగ్రాసం సాగు చేసుకోవాలి. నీటి సౌకర్యం ఉన్న ఎకరం పొలంలో ఏడాది పొడవునా సాగు చేసే పచ్చిమేత 4–5 పశువుల పెంపకానికి సరిపోతుంది.

తల్లిని తీసుకెళ్లిన తనయుడు..

- సుఖాంతమైన వృద్ధురాలి దీనగాథ
- సాకేందుకు తన ఇంటికి తీసుకెళ్లిన చిన్న కుమారుడు



తల్లిని తీసుకెళ్తున్న కుమారుడు కృష్ణ

సాక్షి స్పందన

గార్ల: 'ఆస్తి పంచక ముందే అమ్మ.. పంచాక.. ఇదేమి ఖర్మ' అనే శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి తల్లి చిన్న కుమారుడు, అధికారులు స్పందించారు. గార్లలోని జెండా బజారుకు చెందిన గాడేపల్లి నర్సమ్మ ఆస్తిని కొడుకులు పంచుకుని వృద్ధురాలిని సాకకుండా వదిలేశారు. దీంతో వృద్ధురాలు ఎవరైనా అన్నం పెడితే తిని రాత్రి సమయంలో వారి ఇళ్ల ఎదుట నిద్రిస్తూ జీవనం సాగిస్తోంది. వృద్ధురాలి దీనగాథ పత్రికలు సోషల్ మీడియాల్లో వైరల్ కావడంతో ఎట్టకేలకు ఖమ్మంలో నివాసముంటున్న చిన్న కుమారుడు కృష్ణ.. గార్ల వచ్చి తల్లి నర్సమ్మను సాకేందుకు తీసుకెళ్లాడు. దీంతో వృద్ధురాలి దీనగాథ సుఖాంతమైంది. కాగా, ఈ విషయంపై ఎస్సై ఎస్. జీనత్‌కుమార్, తహసీల్దార్ కె. రవీందర్ ను 'సాక్షి' వివరణ కోరగా కొడుకులను పోలీస్‌స్టేషన్‌కు రమ్మని ఫోన్ చేశామన్నారు. కొడుకులు అందరు వస్తే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిని జాగ్రత్తగా చూసుకోవాలని చెబుతామని పేర్కొన్నారు.

భూములను పరిశీలించిన 'కుడా' చైర్మన్ ఇనగాల



జక్కలొద్ది భూములను పరిశీలిస్తున్న కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

నయింనగర్/సంగెం: ఖిలావరంగల్ మండలం తిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధి జక్కలొద్ది గ్రామంలోని భూములను 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఎక్కడి వరకు విస్తరించి ఉన్నాయి.. ఖబ్జాకు గురైన భూముల వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, సంగెం మండలం గుంటూరుపల్లి గ్రామంలో ఎయిర్‌పోర్ట్ కింద పోయే భూములను పరిశీలించారు.

బాలికపై లైంగికదాడి.. నిందితుడి రిమాండ్

దంతాలపల్లి : బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొర్రూరు సీఐ సంజీవ బుధవారం తెలిపారు. మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన గోనేల రాజు ఈ నెల 6న కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంజీవ తెలిపారు. దంతాలపల్లి ఎస్సై కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

- మృతురాలు వాగ్దేవి కళాశాల వంట మనుషుల కుమార్తె
- ఐనవోలు కస్తూర్బాలో ఇంటర్ ఫస్ట్ ఇయర్
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు



నందు (ఫైల్)

మామునూరు : అనారోగ్య కారణాలతో మనస్తాపం చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన బుధవారం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని వాచ్‌మెన్ నివాస గదిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాల గ్రామం మంగ్లీ తండాకు చెందిన కేలోత్ కిషన్, కవిత దంపతులు వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలోని ఓ గదిలో కుమార్తె నందు(17)తో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ దంపతులు కళాశాలలో వంట మనుషులుగా పనిచేస్తున్నారు. నందు(నందిని) ఐనవోలు కస్తూర్బాగాంధీ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనెల 9న తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటోంది. ఈ క్రమంలో తరచూ అనారోగ్యానికి గురవడంతో మనస్తాపం చెంది బుధవారం ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. తల్లిదండ్రులు మధ్యాహ్నం గదికి వచ్చి చూడగా ఉరేసుకుని కనిపించింది. ఈ విషయాన్ని వెంటనే కళాశాల యాజమాన్యం, పోలీసులకు తెలుపగా హుటాహుటిన పోలీసులు చేరుకుని విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు సేకరించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది రఘునాథపల్లిలో యువతి..



కావ్య (ఫైల్)

రఘునాథపల్లి: జీవితంపై విరక్తి చెందిన ఓ యువతి.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపల్లికి చెందిన కురాకుల లక్ష్మయ్య, రేణుక దంపతుల కూతురు కావ్య (23)కు మూడేళ్ల క్రితం స్టేషన్ ఘన్‌పూర్ మండలం నమిలిగొండకు చెందిన అడిగం మహేందర్‌తో వివాహమైంది. వివాహమైన మూడు నెలలకే దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో కావ్య పుట్టింటికి వచ్చింది. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినా.. కాపురానికి తీసుకెళ్లకపోవడంతో భర్తపై హనుమకొండలోని మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి రఘునాథపల్లిలో తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన కావ్య బుధవారం పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు చూసి అపస్మారక స్థితిలో ఉన్న కూతురును జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

వాగులోకి ఆటో.. తప్పిన ప్రమాదం



ఎస్ఎస్‌తాడ్వాయి: వాగులోకి ఓ ఆటో కొట్టుకుపోయింది. ఈ ఘటన మండల పరిధిలోని ఎల్బాక కాజ్‌వే సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మండలంలోని ఎల్బాక జంపన్న వాగు లోలెవల్ కాజ్‌వే పై నుంచి భారీగా వరద ప్రవహిస్తుండడంతో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాలకు బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. ఎల్బాక గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పోనక వినోద్ కాజ్‌వే వరదలో నుంచి ఆటోను దాటించే ప్రయత్నం చేశారు. వరద తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆటో వాగులోకి కొట్టుకుపోయింది. అప్రమత్తమైన గ్రామస్తులు ఆటో నుంచి డ్రైవర్ వినోద్‌ను బయటకు తీశారు. దీంతో ప్రమాదం తప్పింది. ఈ క్రమంలో తాడ్వాయి పోలీసులు ఎల్బాక కాజ్‌వే వద్ద దాటకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

పోలీసుల పేరుతో వసూళ్లు..

- దోపిడీకి పాల్పడిన వ్యక్తుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జ్ సీఐ క్రాంతికుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జ్ సీఐ క్రాంతికుమార్

దామెర: పోలీసులమంటూ రోడ్డుపై దోపిడీకి పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఇన్‌చార్జ్ సీఐ క్రాంతికుమార్, ఎస్సై కొంక అశోక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం దామెర పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హనుమకొండకు చెందిన ఒర్సు గణేశ్, పల్లెపు రాజు, ఒర్సు చిరంజీవి, అలకుంట నరేశ్.. మద్యం కోసం డబ్బు లేకపోవడంతో కారులో ఈ నెల 15న నడికూడ మండలం రామకృష్ణాపూర్ శివారుకు వచ్చి రహదారిపై వస్తున్న మరో కారును పోలీసులమంటూ ఆపారు. అనంతరం వారిపై కర్రలతో దాడిచేసి సెల్ ఫోన్‌లు, డబ్బులు, కారు లాక్కొన్నారు. అనంతరం రెండు కార్లలో పారిపోయారు. ఈ క్రమంలో కంఠాత్మకూరులో ఏర్పాటు చేసిన బారికేడ్‌ను ఢీకొన్నారు. అక్కడే ఉన్న స్థానికులు వారి వద్దకు రాగా దుర్భాషలాడంతో ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. దీంతో లాక్కొన్న కారును అక్కడే వదిలేసి వారి కారులో పరారయ్యారు. కాగా, బుధవారం దామెర క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో పోలీసులను చూసి కారులో తప్పించుకునేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని 6 సెల్ ఫోన్లు, 2 కర్రలు, కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పరకాల కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన ఎస్సై అశోక్, సిబ్బందిని ఇన్‌చార్జ్ సీఐ క్రాంతికుమార్ అభినందించారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

కాజీపేట రూరల్ : కాజీపేట – పెండ్యాల రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై మొహినొద్దీన్ కథనం ప్రకారం.. కాజీపేట – పెండ్యాల మధ్యలోని అయోధ్యపురం 58 రైల్వే గేట్ సమీపంలో సుమారు 30 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కాషాయ రంగు టవల్ ధరించి ఉన్నాడు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై మొహినొద్దీన్ తెలిపారు.

వీధి కుక్కల స్వైర విహారం

- ఇద్దరికి తీవ్ర గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన శంకరమ్మ

టేకుమట్ల: మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వెంట పడి మరీ దాడులకు పాల్పడుతున్నాయి. మంగళవారం మండలంలోని రామకిష్టాపూర్(వి)కు చెందిన వృద్ధురాలు ఆకునూరి చంద్రమ్మపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని కుటుంబీకులు తెలిపారు. అలాగే, మండలంలోని పెద్దంపల్లికి చెందిన శాస్త్రాల శంకరమ్మపై బుధవారం మూకుమ్మడిగా దాడి చేయగా ముఖం, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108లో భూపాలపల్లి 100 పడకల ఆసుపత్రికి తరలించారు. కాగా, కుక్కల స్వైర విహారం, దాడులపై అధికారులు స్పందించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సెల్ టవర్ పేరిట మోసం..

- రూ.55 వేలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు
- లబోదిబోమంటూ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

చిల్పూరు: సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ ఏదోరకంగా అమాయకులను మోసం చేస్తూనే ఉన్నాయి. దీనికి నిదర్శమే ఈ ఘటన. మండలంలోని ఫత్తేపూర్‌కు చెందిన గుగులోతు మోహన్‌నాయక్‌కు మంగళవారం సాయంత్రం ఓ ఫోన్‌కాల్ వచ్చింది. 'మేము ఐడియా కంపెనీ నుంచి మాట్లాడుతున్నాం మీ వ్యవసాయ భూమిలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తామని, అందుకు మీరు ఒప్పుకుంటారా, వేరే వారి వద్ద మాట్లాడుకోవాలా' అంటూ అడిగారు. దీంతో టవర్ ఏర్పాటు చేస్తే ఎంత ఇస్తారని మోహన్‌నాయక్ ప్రశ్నించడంతో రూ.10 లక్షల అడ్వాన్స్, నెలకు రూ.40 వేలు ఇస్తామని మోసగాళ్లు చెప్పారు. దీనిని మోహన్‌నాయక్ నమ్మి సైబర్‌నేరగాళ్లకు తన ఆధార్, ఇతర ధ్రువపత్రాలను వాట్సాప్‌లో పంపాడు. అయితే టవర్ ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ఖర్చులకు గాను మొదట రూ. 52 వందలు అడిగారు. అనంతరం జీఎస్టీకి రూ. 19,500 అడగగా ఇచ్చాడు. రాత్రి నీ బ్యాంకు అకౌంట్ హోల్డ్ అయిందని మరో రూ. 30, 500 ఇవ్వాలని, అప్పుడే పనిపూర్తవుతందని చెప్పడంతో నమ్మి మొత్తం రూ.55,200వేలు ముట్టజెప్పాడు. ఉదయం మళ్లీ ఫోన్ చేస్తామని చెప్పిన మోసగాళ్లు.. ఫోన్ చేయలేదు. దీంతో మోహన్‌నాయక్‌క్ అనుమానం వచ్చి వారు ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేస్తే దూర్భాషలాడారు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన మోహన్‌నాయకులు పోలీసులు, సైబర్ క్రైమ్ అధికారులను ఆశ్రయించాడు.

పార్టీ మారేది లేదు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: తాను బీఆర్‌ఎస్ పార్టీ మారేది లేదు.. నాపై వస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు, కార్యకర్తలు నమ్మవద్దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తాను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజాసమస్యలపై పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ మండల నాయకులు దొంతమళ్ల గణేష్, గర్వందుల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పంచుకుని గెంటేశారు

- న్యాయం కోసం అధికారులకు ఫిర్యాదు
- మానసిక వేదనకు గురై తండ్రి ఆత్మహత్య
- నిజనిర్ధారణ కమిటీ వెల్లడి



గ్రామంలో విచారణ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు

హసన్‌పర్తి: తండ్రికి ఉన్న ఆస్తిని పంచుకున్న కొడుకులు ఆయనను ఇంటి నుంచి గెంటేశారు. న్యాయం కోసం అధికారులకు ఫిర్యాదు చేయగా ఫలితం లేకపోవడంతో మానసిక వేదనకు గురైన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అన్నాసాగరం గ్రామానికి చెందిన మొట్టె బొందయ్య(90) ఆత్మహత్య చేసుకున్నట్లు నిజనిర్ధారణ కమిటీ వెల్లడించింది. ఈ మేరకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిజనిర్ధారణ కమిటీ బుధవారం అన్నాసాగరం గ్రామాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా బొందయ్య మృతికి కారణాలు తెలుసుకుంది. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య మాట్లాడుతూ.. మొట్టె బొందయ్య ఎనిమి ఎకరాల వ్యవసాయభూమి ఉండగా.. తన ఇద్దరు కొడుకులకు సమానంగా పంపిణీ చేశాడని చెప్పారు. ఆస్తి పంచుకున్న కుమారులు తండ్రిని ఇంటి నుంచి గెంటివేయడంతో న్యాయం కోసం బొందయ్య కలెక్టర్ కార్యాలయం మెట్లెక్కాడని, సీపీని కలిసి ఫిర్యాదు సైతం చేసినట్లు పేర్కొన్నారు. అయినా న్యాయం జరగకపోవడంతో మానసిక వేదనకు గురైన బొందయ్య ఈనెల 1వ తేదీన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు దామెర నర్సయ్య వివరించారు. అధికారులు స్పందించకపోవడం వల్లే ఇలా జరిగిందని, బొందయ్య ఆత్మహత్యకు కారణాలు తెలుసుకుని దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వృద్ధ మిత్ర స్వచ్ఛంద కమిటీలు ఏర్పాటు చేయాలని నర్సయ్య కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తేరాల యుగంధర్, గోకారపు రాజేందర్, రవీందర్, పప్పుల రమేష్, మూల ఐలయ్య, ప్రసాద్, సమ్మయ్య, సాంబయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

'కక్ష సాధింపు కోసమే 'కమిషన్ల' ఏర్పాటు

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ విమర్శ



విలేకరులతో మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

కురవి: 'ప్రభుత్వం వేసే కమిషన్లన్నీ కక్ష సాధింపు కోసమే.. సుప్రీం కోర్టు తీర్పు సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టులాంటిది' అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్‌పై ఏదో ఒకటి ఆపాదించాలనే కుట్రకోణం సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర కనిపిస్తున్నదని ఆరోపించారు. విద్యుత్ కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం వేసిన కమిషన్‌పై అపోహలున్నాయని, నాణ్యమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో విద్యుత్ కొనుగోళ్లు చేపట్టినట్లు వివరించారు. కమిషన్ చైర్మన్ పారదర్శకంగా ఉండాల్సింది పోయి ప్రెస్‌మీట్లు పెట్టడం సరికాదన్నారు. రైతులందరికీ షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయం పేరిట రైతుబంధును అందరికీ ఇవ్వకుండా చేస్తున్నారని, ప్రజాప్రతినిధులతోపాటు అందరి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కొర్రీలు పెడుతున్నారని, గ్యాస్ సిలిండర్లు, గృహజ్యోతి అందరికి రావడంలేదని, పెన్షన్‌లు నేటి పెంచలేదని, రైతుబంధు ఇవ్వడంలేదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు.. కక్ష సాధింపులో భాగంగానే కవితను జైలుపాలు చేసిందని, ఈడీ, సీబీఐ సంస్థలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీల గొంతులు నొక్కుతోందని విమర్శించారు. అంగన్‌వాడీలకు మేమే న్యాయం చేశామని మంత్రి సీతక్క చెబుతున్న మాటలకు అర్థం లేదని, అంగన్‌వాడీ టీచర్లు రిటైర్డ్ అయ్యాక రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇస్తామని కేసీఆర్ చెప్పినట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వం డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాలకు ఇచ్చిన అభివృద్ధి నిధులను తిరిగి తెప్పించి పనులు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఐలి నరహరి, బోడ శ్రీను, బాదె నాగయ్య, గుగులోత్ నెహ్రూనాయక్, గుండెబోయిన సూరయ్య, కల్లెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

- 6 కిలోల సరుకు,బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్ క్రైం : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సుబేదారి పోలీసులు అరెస్ట్ చేసి నిందితుడి నుంచి సుమారు రూ.1.50 లక్షల విలువైన 6 కిలోల సరుకు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాజీపేట విష్ణుపురికి చెందిన ప్రాన్సియా ఆడం కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే గంజాయి అమ్మి సులభంగా డబ్బు సంపాదించాలకున్నాడు. ఇందుకోసం గతంలో భద్రాచలంలో పరిచయమైన హుస్సేన్ ద్వారా ఒడిశా నుంచి గంజాయిని తెప్పించుకుని ట్రై సిటీ పరిధిలో ఎక్కువ ధరకు విక్రయించేవాడు. ఈ క్రమంలో బుధవారం హంటర్‌రోడ్డులోని కోడెం ఫంక్షన్ హాల్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, గంజాయి విక్రయదారుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, ఎస్సై గాలిబ్, ఏఎస్సై రాజయ్య, కానిస్టేబుల్ సత్యనారాయణ, అలీ, ప్రభాకర్‌ను ఏసీపీ అభినందించారు.